సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 4 । నవంబర్ । 2024

మల్లన్నకు బోనం మొక్కులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తులు ఆదివారం పట్నాలు వేశారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు.. తొలుత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మల్లికార్జునస్వామి, సీతారామచంద్రస్వామి, ఖండేలరాయుడు, నందీశ్వరులను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



న్యూస్‌రీల్

జాతీయ స్థాయి కళోత్సవాలకు ఎంపిక



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్: గట్టెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి కళోత్సవాలకు ఎంపికయ్యారు. హైదారాబాద్ మాదాపూర్‌లో ఇటీవల నిర్వహించిన నాటిక పోటీల్లో వైశాలి, ఫిజా, అభినయశ్రీ, మన్య, ఆదర్శ్(టీం)లు పాల్గొన్నాయి. గైడ్‌టీచర్ రాజమల్లు ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్‌తో ప్రమాదం' నాటిక ప్రదర్శించగా రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించాయి. ప్రతిభ చూపిన విద్యార్థులు, టీచర్‌ను డీఈవో మాధవి అభినందించారు. డిసెంబర్‌లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని టీచర్ రాజమల్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి విలు విద్య పోటీలకు..



అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. అండర్- 14, -17 బాల, బాలికల పోటీల్లో ప్రతిభ చూపారు. ఇందులో ప్రణీత్, మనస్విని, సానియా ఉన్నారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సురేంద్రప్రసాద్ తెలిపారు. ఈనెల 5వ తేదీ వరకు మహబూబాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు వీరు హాజరువుతారని హెచ్‌ఎం వివరించారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.


హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: హమాలీల సమస్యలు పరిష్కరించాలని, వారి అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఆదివారం యూనియన్ జిల్లా సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడారు. కార్మికులకు గుర్తింపు కార్డులు జారీచేయాలని, పింఛన్, బీమా సౌకర్యం వర్తింపజేయాలన్నారు. ధాన్యం క్వింటాలుపై రూ.5, పత్తి క్వింటాలుపై రూ.200 పెంచాలని ఆయన కోరారు. నాయకులు తిరుపతి, సదయ్య, కనకయ్య, రజవెల్లి, శంకరయ్య, నంబయ్య, వెంకటేశ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

'మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి'



మాట్లాడుతున్న రవీందర్

పెద్దపల్లిరూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు పర్చాలని పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీపెల్లి రవీందర్, ఎండీ ఖాజా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్కర్లకు బకాయి పడ్డ వేతనాలను చెల్లించాలని కోరారు. పలు డిమాండ్లతో ఈనెల 5న కలెక్టరేట్ వద్ద ఒకరోజు దీక్ష చేపడతామని ఆయన తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'అనుమతి లేకుండా రికవరీ సరికాదు'

గోదావరిఖని: అనుమతి లేకుండా సింగరేణి కార్మికుల వేతనాల్లోంచి రికవరీ చేయడం సరికాదని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు ఆదివారం విమర్శించారు. గుడి పేరిట ఒక్కో కార్మికుడి వేతనం లోంచి రూ.500 చొప్పున అక్టోబరు నెల వేతనంలో రికవరీ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్మికుడి అనుమతితో యూనియన్ చందా కోసం 1875 యూనియన్ కోడ్‌పై రికవరీ చేయాలే తప్ప అనుమతి లేకుండా చేయొద్దన్నారు.

బకాయిదారులపై కొరడా

- రామగుండం బల్దియాలో రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు
- మున్సిపాలిటీల్లో పేరుకుపోతున్న ఆస్తిపన్ను
- కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి తహసీల్దార్లు
- మొండి బకాయిదారులకు నోటీసులు



ఇంజినీరింగ్ కాలేజీ ప్రతినిధులు నుంచి బకాయిలు స్వీకరిస్తున్న తహసీల్దార్, బల్దియా అధికారులు(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో ఆస్తిపన్ను బకాయిలు వసూలు చేసేందుకు తొలిసారిగా రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు చేస్తున్నారు. జిల్లాలోని స్థానిక సంస్థలకు ఆస్తిపన్ను చెల్లించకుండా బకాయిదారులు ఏళ్ల తరబడి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. దీంతో 'రెవెన్యూరికవరీ యాక్ట్' అమలు చేయాలని జిల్లా మున్సిపల్ యంత్రాంగాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. దీంతో రామగుండం బల్దియాలో బకాయిదారులపై అధికారులు కొరడా ఝులిపించారు.

రూ.1.65కోట్ల బకాయిలు

రామగుండం బల్దియాలో సుమారు రూ.1.65కోట్ల మొండి బకాయిలు పేరుకుపోయాయి. సకాలంలో ఆస్తిపన్ను వసూలు కాకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలతో పాటు ఇతర సాధారణ సేవలపై ప్రభావం పడుతోంది. దీంతో బల్దియాలోని 10 మంది మొండి బకాయిదారులపై చర్యలకు కలెక్టర్ ఆదేశించారు. కాగా జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో మొండి బకాయిదారుల జాబితాను ఆయా మున్సిపల్ అధికారులు సిద్ధం చేస్తున్నారు.

ఆస్తుల వేలానికి నోటీసులు

బల్దియా పరిధిలో ఆస్తిపన్ను చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న బకాయిదారుల ఆస్తులు వేలం వేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా బకాయిదారులకు అదనపు కలెక్టర్, నగరపాలక కమిషనర్ జె.అరుణశ్రీ నేతృత్వంలో మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగం అధికారులతో పాటు రామగుండం తహసీల్దార్ వేర్వేరుగా నోటీసులు జారీ చేశారు. బకాయిదారులకు చెందిన ఆస్తుల విలువలను ఇప్పటికే రిజిస్ట్రార్ విభాగంతోపాటు మున్సిపల్, రెవెన్యూ, ఇంజినీర్లు సంయుక్తంగా లెక్కించి జాబితా కూడా సిద్ధం చేశారు.

10 మందికి నోటీసులు

బల్దియాలో ఆస్తిపన్ను చెల్లించని 10 మంది బకాయిదారులకు నగరపాలక సంస్థతోపాటు రామగుండం తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. పన్ను చెల్లించకుంటే చట్టప్రకారం వారి ఆస్తులను రెవెన్యూ శాఖ ద్వారా స్వాధీనం చేసుకొని వేలం ద్వారా బకాయిలు వసూలు చేస్తామని పేర్కొన్నారు. ఈ 10 మందిలో ఒక సినిమా థియేటర్ యజమాని హైకోర్టును ఆశ్రయించి స్టే పొందేందుకు ప్రయత్నం చేయగా, సకాలంలో తహసీల్దార్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసి స్టే రాకుండా అడ్డుకున్నారు.

రూ.20.24 లక్షలు వసూలు

బల్దియా పరిధిలోని సింధూర ఇంజినీరింగ్ కాలేజీ ఐదేళ్ల నుంచి ఆస్తిపన్ను చెల్లించకపోవడంతో రామగుండం తహసీల్దార్ కుమారస్వామికి రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ఇటీవల మున్సిపల్ కమిషనర్ లేఖ పంపించారు. దీంతో స్పందించిన తహసీల్దార్ సదరు కాలేజీ ప్రతినిధులకు పన్ను చెల్లించకుంటే చట్టప్రకారం ఆస్తి స్వాధీనం చేసుకుని వేలం వేస్తామంటూ ఇటీవల నోటీసులు జారీ చేశారు. దీంతో కళాశాల ప్రతినిధులు గత నెల 30న బకాయి ఉన్న ఆస్తిపన్ను రూ.20.24 లక్షలు ఇటీవల చెల్లించారు.

మొత్తం చెల్లించాల్సిందే..



బకాయిదారులు ఆస్తిపన్ను చెల్లించకుంటే రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా వారి ఆస్తులను వేలం వేయక తప్పదు. బకాయిపడిన యజమానులకు కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్, తహసీల్దార్ ద్వారా నోటీసులు జారీచేశాం. కొందరు సగం బకాయిలు చెల్లిస్తామంటున్నారు. దీనికి అంగీకరించం. మొత్తం చెల్లించాల్సిందే. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ బల్దియాల్లోని బకాయిదారుల వివరాలూ సేకరిస్తున్నాం.

– జె.అరుణశ్రీ, అడిషనల్ కలెక్టర్, రామగుండం బల్దియా కమిషనర్

గెలుపోటములు సహజం

- ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



బహుమతులు అందిస్తున్న ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఆటల పోటీల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కోమురోజు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో ఆదివారం అండర్ -17 బాల, బాలికల ఖోఖో జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మెలకువలు తెలుసుకుంటేనే క్రీడాకారులు పోటీల్లో విజయం సాధిస్తారని అన్నారు. క్రీడా పోటీలతో స్నేహభావం పెంపొందడంతోపాటు శారీరక, మానసికంగా ఉల్లాసంగా ఉంటారని వివరించారు. కాగా, బాలుర విభాగంలో మంథని జట్టు ప్రథమ, సుల్తానాబాద్ జట్టు ద్వితీయ బహుమతి సాధించాయి. బాలికల విభాగంలో సుల్తానాబాద్ జట్టు ప్రథమ, పెద్దపల్లి జట్టు ద్వితీయ బహుమతి సాధించాయి. అతిథులు విజేతలకు బహుమతుతు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి, ప్రతినిధులు సురేందర్, కార్యదర్శి దాసరి రమేశ్, శౌరెడ్డి, గెల్లు మధుకర్, మాధురి, దాసరి ప్రసాద్, షఫీ, ప్రణయ్, సంధ్య, మాధవి, ఇక్బాల్, ఆజ్జు, ప్రవీణ్, రాకేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు(పెద్దపల్లి): రైతుల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు సింగిల్‌విండో ఆధ్వర్యంలో నర్సాపూర్, నారాయణపల్లి, ర్యాకల్‌దేవుపల్లి, రాములపల్లి గ్రామాల్లో ఆదివానం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతు పండించిన ప్రతీగింజకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామన్నారు. గతంలో సన్నరకం వడ్లు సాగుచేయాలని సూచించి రైతులను దివాలా తీయించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేని విమర్శించారు. రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. సన్నవడ్లకు క్వింటాలు రూ.500 బోనస్ చెల్లిస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. తూకంలో మోసం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సీఈవో కౌట్టి విక్రమ్, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, సామ రాజేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాలుసాని పరుశరాములుగౌడ్, వెంకటేశ్వర్‌రావు, కొండ తిరుపతిగౌడ్, కొండాల్‌రెడ్డి, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, పోల్సాని పుల్లారావు, భూర్ల వెంకటసత్యం, రంగు శ్రీనివాస్, వెంకటేశ్‌గౌడ్, పెద్ది కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణనతో సంపూర్ణ సమాచారం

సుల్తానాబాద్(పెద్దపల్లి): కుల గణనతో కుటుంబ సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుగ్లాంపల్లిలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టే రోడ్డు పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈనెల 6న సర్వే ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినుపల ప్రకాశ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, కౌన్సిలర్ మమత, నాయకులు గణేశ్, సాయిరి మహేందర్, చిలుక సతీశ్, రవి, సంతోష్‌రావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఐక్యంగా ముందుకు సాగితేనే బీసీలకు రాజ్యాధికారం
- కులాల లెక్క తేల్చేందుకే కులగణన
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- బంధంపల్లిలో ఆత్మీయ సమ్మేళనం



విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ రవిచంద్రను సత్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: మున్నూరుకాపులు అన్నిరంగాల్లో ఎదగాలని, ఐక్యంగా ముందుకు సాగితేనే బీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి(బంధంపల్లి)లో ఆదివారం మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ తదితర నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు. సమాజంలో అత్యధిక శాతం బీసీలు ఉన్నారని, కేవలం రెండంకెల సంఖ్య కూడా దాటని అగ్రవర్ణాలకే అధికారం దక్కుతోందన్నారు. కాపులు ఐక్యంగా ఉంటూ రాజకీయ రంగంలో రాణించాలని కోరారు. ఇంటింటి సర్వేతో ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టిందని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. మొత్తం 50 ప్రశ్నలతో కూడిన సమాచారాన్ని ఎన్యూమరేటర్ సేకరిస్తారని ఆయన తెలిపారు. దీనిద్వారా బీసీలకు 52శాతం రిజర్వేషన్లు దక్కే అవకాశం ఉందని ఆయన అన్నారు. అగ్రవర్ణాలు కేవలం 8.9శాతమే ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు యువత రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్, అధ్యక్షుడు బండి సంజీవ్, ప్రవీణ్‌కుమార్, తొగరి సురేశ్, ఎడ్ల రవి, రాజ్‌కుమార్, అనిల్, కిషన్, బాలకృష్ణ, రాజేందర్, తోట కాంతయ్య, పూదరి కిషన్, దాసరి రాజేశం తదితరులు ఘనంగా సత్కరించారు.

నియామకం



సామల రాజేంద్రప్రసాద్

సుల్తానాబాద్(పెద్దపల్లి): చేనేత ఐక్య వేదిక జిల్లా అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన సామల రాజేంద్రప్రసాద్‌ను నియమించారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు ఆడేపు శంకర్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

చేయి చేయి కలిపి.. ఉద్యానవనం శుభ్రం చేసి..

- శ్రమదానంతో పిచ్చిమొక్కల తొలగింపు
- దుర్గానగర్ లే అవుట్ కాలనీవాసుల ఆదర్శం



పార్కును శుభ్రం చేస్తున్న కాలనీవాసులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని దుర్గానగర్‌లోని ఉద్యానవనం పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారింది. ఇందులో ప్రతీరోజు వాకింగ్, యోగా సాధన చేసే కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన దుర్గానగర్ లే అవుట్ కాలనీ అధ్యక్షుడు తూముల రాజేశ్వర్‌రావు స్పందించారు. శ్రమదానంతో పార్కును శుభ్రం చేయాలని నిర్ణయించారు. ఇదే విషయంపై శనివారం రాత్రి కాలనీవాసులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. కాలనీ కమిటీ సభ్యులతో పాటు స్థానికులు శ్రమదానంలో పాల్గొనేలా ఒప్పించారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం కమిటీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కొడవళ్లు, కట్టర్లు, రంపాలు చేతపట్టి ఉద్యానవనంలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, ప్లాస్టిక్ బాటిల్స్ తొలగించారు. పార్కును శుభ్రం చేశారు. కాలనీలో పచ్చదనం పెంపొందించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి స్థానికులు సహకరించాలని అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు కోరారు. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో కాలనీవాసులు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు పీఎస్ అమరేందర్, ఉపాధ్యక్షులు ఉమ్మెత్తుల దేవేందర్‌రెడ్డి, చందా రాజేశ్వర్‌రావు, సురేశ్ పటేల్, ప్రధాన కార్యదర్శి జక్కుల నారాయణ, సాంస్కృతిక కార్యదర్శి రెడ్డి రవీందర్‌రెడ్డి, కోశాధికారి పోకల ఆంజనేయులు, ముఖ్య సలహాదారులు బాలసాని స్వామిగౌడ్, బంక రామస్వామి, తూముల అశోక్‌రావు, ఇనగంటి సత్యనారాయణరావు, నాగేశ్వరరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'పుడా' సాధనకు ఉద్యమం

- మున్సిపాలిటీల్లో తీర్మానాలు చేయిద్దాం
- అధికారులు, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెంచుదాం
- పుడా సాధన సమితి సమావేశంలో పలువురు వక్తలు



సమావేశంలో నాయకులు బొంకూరి సురేందర్ సన్నీ, సత్యనారాయణరెడ్డి, రామ్మూర్తి తదితరులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పుడా) సాధన కోసం ఉద్యమించేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని 'పుడా' సాధన సమితి సమావేశంలో వక్తలు అన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొంకూరి సురేందర్ సన్నీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో మాజీ ఎంపీపీలు సి.సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, బి.రమేశ్‌గౌడ్, కొలిపాక శ్రీనివాస్, రామగిరి చంద్రమౌళి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ కావేటి రాజగోపాల్ తదితరులు మాట్లాడారు. పెద్దపల్లి లోనే 'పుడా' ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అందరి మద్దతు కూడగడదాం..

'పుడా' సాధన కోసం పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల పాలక మండళ్లతో తీర్మానాలు చేయిద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ మాజీ సర్పంచుల మద్దతును సైతం తీసుకోవాలని సమావేశంలో ప్రతినిధులు నిర్ణయించారు. అయినా, పాలకులు స్పందించకపోతే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పెద్దపల్లిలో బంద్ పాటించేలా కార్యాచరణ చేపడతామని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన పెద్దపల్లిలోనే 'పుడా' ఏర్పాటు చేయడం సముచితమని, పాలకులు, అధికారులు ఈదిశగా పునరాలోచన చేయాలని వారు డిమాండ్ చేశారు.

సీఎంకు విన్నవిద్దాం..

రాష్ట్రంలోనే పారిశ్రామిక ప్రాంతంగా ప్రత్యేక గుర్తింపు పొందిన పెద్దపల్లి జిల్లాకేంద్రంలోనే 'పుడా'ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సైతం కలిసి విన్నవించేలా కార్యాచరణ తీసుకుందామని 'పుడా' సాధన సమితి నాయకులు నిర్ణయించారు. అయితే, అంతకు ముందు స్థానిక ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే విజయరమణారావును కలిసి విన్నవించాలని, కలెక్టర్‌కు 'పుడా' ఏర్పాటు ఆవశ్యకతను వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరాలని సమావేశంలో తీర్మానించారు.

నిర్ణయం మార్చుకోవాలి



జిల్లాలో రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలి. జిల్లా కేంద్రంలోనే 'పుడా' ఏర్పాటు చేయాలి. అందుకు ఈప్రాంత ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి. అనూహ్యంగా జిల్లాగా అవతరించిన పెద్దపల్లి పదేళ్లలో కనీస అభివృద్ధికి నోచలేదు. ఇప్పుడు 'పుడా'తోనైనా అభివృద్ధి జరుగుతుందనుకుంటే ఆ ఆశలను ఆవిరి చేశారు.

– సి.సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ

'పుడా' ఏర్పడితేనే మేలు



పెద్దపల్లి అభివృద్ధి జరగాలంటే 'పుడా' ఏర్పాటు కావాలి. జిల్లా తొలి కలెక్టర్ అలగు వర్షిణి చేసిన ప్రతిపాదనలకు అవసరమైతే మరిన్ని మండలాలు, గ్రామాలను కలిపి పెద్దపల్లిలోనే 'పుడా' ఏర్పాటు చేయాలి. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రాజకీయాలకతీతంగా ముందుకు సాగుదాం. 'పుడా' ఏర్పాటు దిశగా ప్రభుత్వం ఆలోచించేలా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– రామగిరి చంద్రమౌళి, మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు

వర్గపోరుతోనే కార్పొరేట్ గుత్తాధిపత్యం నిర్మూలన

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జేవీ చలపతిరావు



మాట్లాడుతున్న జేవీ చలపతిరావు, వేదికపై ఐ.నరేశ్, ఐ.కృష్ణ, కె.రాజన్న, జ్యోతి తదితరులు

జ్యోతినగర్(రామగుండం): కేంద్ర ప్రభుత్వ మతోన్మాద, కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యాన్ని వర్గ పోరాటాలతో నిర్మూలించినప్పుడే అమరులకు నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జేవీ చలపతిరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. ఎన్టీపీసీ ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అధ్యక్షతన ఆదివారం జరిగిన అమరుల సంస్మరణ సభలో వారు మాట్లాడారు. వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు అనేక మంది నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కోసం పోరాడుతున్నారని, ఈక్రమంలోనే వేలాది మంది అమరులయ్యారని తెలిపారు. వారి త్యాగాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్‌కు అడుగులు వేయాలని వారు కోరారు. దేశంలో కొనసాగుతున్న అర్ధ వలస–అర్ధ భూస్వామ్య దోపిడీ వ్యవస్థను కూకటివేళ్లతో సహా కూల్చివేయకుండా ప్రజా సమస్యలు పరిష్కారం కావని అన్నారు. సభలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, జిల్లా అధ్యక్షుడు నరేశ్, కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, అరుణోదయ రాష్ట్ర నాయకుడు బతుకుల రాజన్న, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతితోపాటు పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నరేశ్(ఫైల్)

కమాన్‌పూర్(మంథని): గుండారం గ్రామానికి చెందిన నది నరేశ్(24) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. నరేశ్ శనివారం రాత్రి గ్రామ శివారులో పురుగుల మందు తాగానని కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్‌తో సమాచారం అందించగా.. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని నరేశ్‌ను పెద్దపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. నరేశ్ ట్రాక్టర్, వరికోత మిషన్లపై డ్రైవర్‌గా పని చేసేవాడు. నరేశ్ మృతికి గల కారణాలు తెలియరాలేదు.

విద్యార్థి అదృశ్యం


సాయిగణేశ్

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌కు చెందిన బొమ్మెన తిరుపతి కుమారుడు సాయిగణేశ్(17) అనే ఇంటర్ విద్యార్థి శనివారం నుంచి కన్పించక పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం తండ్రి తిరుపతి తన కుమారుడు కన్పించడం లేదంటూ కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బొమ్మకల్ పంచాయతీ పరిధిలోని కృష్ణానగర్‌కాలనీలో బొమ్మెన తిరుపతి టీ కొట్టు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తిరుపతి కుమారుడు సాయిగణేశ్ కరీంనగర్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం కళాశాలకు పోతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాయిగణేశ్ రాత్రయినా తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇంట్లో సాయిగణేశ్ ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన ఐదుగురిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చిందని గ్రామస్తులు తెలిపారు. నేదూరి రమేశ్, గడ్డం పుష్పవ్వ, గోపి ప్రకాశ్‌తోపాటు మరో ఇద్దరిపై దాడి చేసిందన్నారు. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): వేధింపులకు పాల్పడిన ఘటనపై గ్రామంలో పంచాయితీ చేస్తున్న క్రమంలో దాడికి పాల్పడిన ఓ వ్యక్తి, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆరోగ్యం ఆదివారం తెలిపారు. పాపయ్యపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన గెల్లు మహేందర్ మూడు రోజుల క్రితం వ్యవసాయ పనులకు వెళ్తున్న సమయంలో వేధింపులకు పాల్పడ్డాడు. భర్త, కుటుంబ సభ్యులు కలిసి గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేస్తున్న క్రమంలో వివాహిత, భర్తపై దాడికి పాల్పడ్డారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. కథలాపూర్ మండలంలోని ఓ వాగు నుంచి నిజామాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గ మధ్యంలో డిపో వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీఐ పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం లారీ యజమాని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. లారీ యజమానులు అనుమతులు తీసుకొని ఇసుకను తరలించాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

రెండేళ్ల బాలుడి కిడ్నాప్!

- హైదరాబాద్‌లో ఆచూకీ గుర్తించిన పోలీసులు
- బెగ్గింగ్ మాఫియాకు అమ్ముతుండగా పట్టివేత

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీం'నగరం'లో రెండేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం రేపింది. కిడ్నాప్‌ను సవాల్‌గా తీసుకున్న పోలీసులు.. కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నగరంలోని వన్‌టౌన్ పరిధిలో నివసిస్తున్న ఓ మహిళకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆమెకు బాగా సన్నిహితంగా ఉండే ఓ స్నేహితురాలు.. బాబును ఆడించినట్లు నటించి తన వెంట తీసుకెళ్లింది. తన బాబు కనబడకపోయేసరికి సదరు తల్లి తల్లడిల్లిపోయింది. చుట్టుపక్కల వెదికి.. చివరికి వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితురాలు బాబుతో హైదరాబాద్ వెళ్లినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ల ఆధారంగా కిడ్నాప్ చేసిన మహిళ, బాబును గుర్తించారు. అక్కడ బాబును రూ.50వేలకు బెగ్గింగ్ మాఫియాకు విక్రయించేందుకు సిద్ధమవుతుండగా.. ఆ ప్రయత్నాన్ని పోలీసులు సకాలంలో చేరుకుని భగ్నం చేయగలిగారు. బాబును కాపాడిన పోలీసులు.. మహిళను అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం సదరు కిడ్నాప్ ఘటన వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది. 2022 ఆగస్టులో అశోక్‌నగర్‌కి చెందిన ఓ బాలికను ఆటో డ్రైవర్ కిడ్నాప్ చేయగా వన్‌టౌన్ పోలీసులు 24 గంటల్లో పాప ఆచూకీ కనిపెట్టారు. 2023 ఫిబ్రవరిలోనూ టూటౌన్ పరిధికి చెందిన ఓ మహిళ తన పొరుగింట్లో ఉండే ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసి మహారాష్ట్ర తీసుకువెళ్లిన ఘటన అప్పట్లో కలకలం రేపిన విషయం తెలిసిందే.

కేంద్రాలు సరే.. కొనుగోళ్లేవి?

- జాప్యాన్ని నిరసిస్తూ పార్లమెంట్ పరిధిలో నిరసనలు
- నేడు తహసీల్దార్లకు వినతిపత్రాలు
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా నేటికీ వడ్ల కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడం బాధాకరమని, ఈ విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, ఆచరణకు పొంతనే లేకుండా పోయిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 7,572 వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం వాటిలో ఇప్పటికే 4,598 కేంద్రాలను తెరిచినట్లు పేర్కొందని, కానీ తమకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్క కేంద్రంలోనూ ఇంతవరకు వడ్ల కొనుగోలు ప్రారంభమే కాలేదన్నారు. వడ్ల కుప్పలతో కేంద్రాలన్నీ నిండిపోవడంతో స్థలం లేక ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోడ్లపై రాశులుగా పోస్తున్నారని తెలిపారు. దీంతో రైతులకు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వడ్లు తడిసిపోయాయని, చాలా చోట్ల కోతకు వచ్చిన పంట నీటిపాలైందన్నారు. తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా తడిసిన ప్రతీ గింజను కొనాలన్నారు. అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతుల పక్షాన త్వరలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. అందులో భాగంగా బీజేపీ శ్రేణులు సోమవారం అన్ని మండల కార్యాలయాలకు వెళ్లి తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

జువ్వాడి సూర్యారావుకు కన్నీటి వీడ్కోలు


తిమ్మాపూర్‌లో సూర్యారావు అంత్యక్రియల్లో విప్ అడ్లూరి


సూర్యారావు మృతదేహం వద్ద భార్య, కూతుళ్లు

ధర్మపురి: దివంగత జువ్వాడి రత్నాకర్‌రావు సోదరుడు జువ్వాడి సూర్యారావు మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందగా.. మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన మండలంలోని తిమ్మాపూర్‌కు తీసుకొచ్చారు. అంతిమయాత్రలో ప్రభుత్వ విప్, వందలాది మంది పాల్గొన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు తదితరులు పాల్గొన్నారు. సూర్యారావుకు యనకు భార్య భారతి, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

సూర్యారావు కూతురు హైకోర్టు జడ్జి

సూర్యారావు నలుగురు కూతుళ్లలో పెద్ద కూతురు శ్రీదేవి ప్రస్తుతం హైకోర్టు జడ్జి. రెండో కూతురు శ్రీలత, మూడో కూతురు శ్రీకుమారి, నాలుగో కూతురు శిరీష. హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్న పెద్ద కూతురు శ్రీదేవి తండ్రికి తలకొరివి పెట్టడం అందరిని కలచివేసింది. తండ్రి మరణంతో కూతుళ్లు శోక సంద్రంలో మునిగారు.

సమస్యల పరిష్కారానికి కృషి


ప్రచారం చేస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని, ప్రైవేటు విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని గిద్దెపెరుమాండ్లస్వామి ఆలయ మైదానంలో వాకర్స్‌తో, జిల్లా గ్రంథాలయంలో పట్టభద్రులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సమాయత్తమవుతున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అల్ఫోర్స్ పక్షాన ఉచిత యాప్ అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్క పట్టభద్రుడు నవంబర్ 6 లోపు తమ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ వరకు ప్రాంతీయ క్రీడా పాఠశాల

- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి


మాట్లాడుతున్న శివసేనారెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలను వచ్చే సంవత్సరం నాటికి ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేస్తానని, పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఎక్కడికి వెళ్లకుండా ఇక్కడే ఉండి క్రీడల్లో రాణించి దేశానికి పతకాలు అందించే క్రీడాకారులుగా తయారు కావాలని శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులకు సూచించారు. ఆదివారం రాత్రి ఆయన ఆకస్మికంగా క్రీడా పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులు, గ్రంథాలయం గది పరిశీలించారు. బాక్సింగ్, జూడో, స్విమ్మింగ్ పూల్, సింథటిక్ ట్రాక్, విద్యార్థుల హాస్టల్ గదులను చూశారు. విద్యార్థులు ఆయా క్రీడల్లో తీసుకుంటున్న శిక్షణను కోచ్‌లనడిగి తెలుసుకున్నారు. శిక్షణ ఎలా పొందుతున్నారో విద్యార్థులను అడిగారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్రీడల్లో రాణించిన వారు గొప్ప స్టార్లుగా ఎదుగుతారన్నారు. హకీంపేట స్కూల్ తరహా మీకు కూడా అన్ని సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, కోచ్‌లు పవన్, సాయిరాం, శ్యామ్, చందు, సంపత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జాప శ్రావణ్‌రెడ్డి, కిమ్ ఫహాద్, గట్టు ప్రశాంత్, ఆకుల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు


యమధర్మరాజుకు పూజలు చేస్తున్న అర్చకుడు

ధర్మపురి: ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదని వేద పండితుడు బొజ్జ రమేశ్‌శర్మ పేర్కొన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీ యమధర్మరాజు ఆలయంలో ఆదివారం యమ ద్వితీయ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆయుష్య హోమం హారతి, మంత్రపుష్పము తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ, ప్రపంచంలో యమ ధర్మరాజు ఆలయం ఒక్క ధర్మపురిలోనే ఉందని, ప్రతీ నెల భరణి నక్షత్రము, ఏటా యమ ద్వితీయ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

6 గంటలు.. 72 పాటలు

- ఐదు బుక్ ఆఫ్ రికార్డ్స్ నెలకొల్పిన సింగర్ సల్వాజీ సంధ్య


రికార్డు అందుకుంటున్న సల్వాజీ సంధ్య దంపతులు

కరీంనగర్‌కల్చరల్: ఆరు గంటలపాటు నిర్విరామంగా 72 పాటలు పాడి ఐదు బుక్ ఆఫ్ రికార్డులు నెలకొల్పింది కరీంనగర్‌కు చెందిన గాయనీ సల్వాజీ సంధ్య. కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో ఆదివారం సల్వాజీ ప్రవీణ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగర్ సల్వాజీ సంధ్య ఆరు గంటల పాటు 72 పాటలు పాడి ఐదు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లు నెలకొల్పింది. భరత్ వరల్డ్ రికార్డు, సింగర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డు, కల్చరల్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్‌లో చోటు సంపాదించింది. వరల్డ్ రికార్డ్ కో– ఆర్డినేటర్ కేవీ.రమణరావు పర్యవేక్షణలో ఎనిమిది మంది వాయిద్యా కళాకారుల సాయంతో సంధ్య ప్రముఖ గాయని కే.ఎస్.చిత్ర పాటలను పాడింది. ఆర్.అనిల్, ఎం.ప్రశాంత్, ఎస్.మహేందర్, కె.వినోద్, సతీశ్, సాయి, సత్యం, మల్లేశ్ సంగీత సహకారం అందించారు. ఈ సందర్భంగా సంధ్యను గాయకులు, అధికారులు, కళాకారులు అభినందించారు. ఆర్డీవో మహేశ్వర్, కేఎస్.అనంతచార్య, జి.కృపాదానం, వి.గోపాల్‌రావు, సల్వాజి ప్రవీణ్ పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్


సెల్ టవర్ ఎక్కిన రాకేశ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలోని సెల్ టవర్‌పైకి పెద్దపల్లి మండలం రాఘవపూర్‌కు చెందిన ఇంజాల రాకేశ్ ఆదివారం ఎక్కి హల్‌చల్ సృష్టించాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. రాకేశ్ తన గ్రామంలో కొందరితో ప్రాణభయం ఉందని, ఎవరూ పట్టించుకోవడం లేదని మానస్తాపం చెంది సెల్ టవర్ ఎక్కాడు. దాదాపు రెండు గంటలపాటు హైడ్రామా సృష్టించగా.. ఎస్సై, సీఐ సుబ్బారెడ్డి, బాధితుడి కుటుంబ సభ్యులు నచ్చజెప్పారు. కిందకు దిగగా.. పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

జగిత్యాలక్రైం: గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం జగిత్యాల పట్టణంలోని రాజీవ్ బైపాస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టగా.. అనుమానాస్పదంగా స్కూటీపై వెళ్తున్న యువకులను తనిఖీ చేస్తే గంజాయి లభించిందన్నారు. జగిత్యాల రూరల్ మండలం బాలెపల్లి గ్రామానికి చెందిన జక్కుల మధు, పెగడపల్లి మండలం వెంగళాయపేటకు చెందిన రాచర్ల వంశీ, పాలకుర్తి మండలం కుక్కలగూడురుకు చెందిన నలిమెల వినోద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకొచ్చి జగిత్యాలలో యువకులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్నారు. వంశీపై గతంలో రెండు గంజాయి కేసులు నమోదయ్యాయని, వినోద్‌పై ఏడు కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయని అన్నారు. ఎస్సై మన్మథరావు, కిరణ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పత్తి తూకంలో మోసం


వాహనాన్ని పట్టుకున్న గ్రామస్తులు, రైతులు

ధర్మపురి: పత్తి తూకంలో మోసం చేసి పారిపోతున్న దళారులను గ్రామస్తులు, రైతులు పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. తుమ్మెనాల గ్రామానికి చెందిన అప్పాల మల్లయ్య పత్తిని ఆదివారం పత్తి దళారులు ఎలక్ట్రానిక్ కాంటాలో తూకం వేశారు. రైతు నుంచి కొనుగోలు చేసిన పత్తి 5క్వింటాళ్ల12కిలోలని చూపించారు. కాని రైతు అంతకుముందే ఇంటి వద్ద తూకం వేసుకోగా.. 6క్వింటాళ్ల77కిలోలు ఉంది. 165 కిలోల పత్తి తక్కువగా వచ్చింది. పసిగట్టిన రైతు దళారిని ప్రశ్నించే లోగా వ్యాన్‌తోపాటు పరారయ్యాడు. గ్రామస్తులు, రైతులు వ్యానును వెంబడించి గ్రామ శివారులో పట్టుకొని డ్రైవర్‌తోపాటు కూలీలను పోలీసులకు అప్పజెప్పారు. పత్తి వ్యానును పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ముందుగానే తూకం వేసుకొని విక్రయించడానికి సిద్ధంగా ఉండాలని పోలీసులు సూచించారు.

చిన్నారి బతుకు పోరాటం

- బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వైనం
- దాతలు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు


దాతలు ఆదుకోవాలని చేతులు జోడించి వేడుకుంటున్న చిన్నారి అనన్య

ఫోన్ పే నంబర్: 9963663653

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తోటి పిల్లలతో ఆడుతూపాడుతూ చదువుకోవాల్సిన ఓ చిన్నారి నాలుగేళ్ల వయస్సులోనే బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. తనకు వైద్య చికిత్స కోసం దాతలు ఆర్థిక సాయమందించి ఆదుకోవాలని చేతులు జోడించి వేడుకుంటోంది. కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన తాళ్లపల్లి అనూష–ప్రశాంత్ కూతురు అనన్యను బ్లడ్ క్యాన్సర్ వేధిస్తోంది. వైద్యం కోసం అనన్య తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. రూ.10లక్షలు చెల్లిస్తేనే వైద్యం అందిస్తామని వైద్యులు పేర్కొన్నారు. డబ్బుల్లేని ఆ నిరుపేద కుటుంబం దాతలు సాయం చేయాలని వేడుకుంటోంది.

చదువుకోవాలని ఉంది.. సాయం చేయండి

ఫోన్ పే, గూగుల్ పే
న్యాత రాజం 9121349332,
బర్ల అనుదీప్ 8497950725


సోషల్ మీడియాలో సర్టిఫికెట్లు చూపుతున్న అక్షయ

మేడిపల్లి(జగిత్యాల): చదువుల తల్లికి విద్య కొనలేని ఆపదొచ్చింది. సోషల్ మీడియా వేదికగా చదువుకోవాలని ఉంది.. సాయం చేయండని ఓ నిరుపేద విద్యార్థిని పోస్ట్ చేయడం స్థానికంగా చర్చకు దారి తీసింది. కాచారం గ్రామానికి చెందిన న్యాత అక్షయ తన కుటుంబ పరిస్థితిని వివరిస్తూ.. తనకు ఎంసెట్‌లో మంచి ర్యాంక్ వచ్చిందని, బీఎస్సీ నర్సింగ్ ఆసిఫాబాద్‌లో సీటు వచ్చిందని తెలిపింది. ప్రస్తుతం ఎంట్రెన్స్ ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నానని, దాతలు సాయం చేయాలని కోరింది. అక్షయ తల్లి చిన్నతనంలోనే చనిపోయిందని, తండ్రి కంటిచూపు సరిగా లేక ఇంటిపట్టునే ఉంటాడని గ్రామస్తులు తెలిపారు. అక్షయ ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కస్తూర్బా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుందని, దాతలు సాయం చేస్తే తన భవిష్యత్తు బాగుంటుందన్నారు. సాయం చేసేవారు కింది నంబర్లకు పంపించాలని వారు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో అంధకారం


కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో చీకట్లో ప్రయాణికులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో అధికారుల నిర్లక్ష్యంతో అంధకారం నెలకొంది. ఆదివారం రాత్రి 7 గంటలకు తిరుపతికి వెళ్లాల్సిన ప్రయాణికులు చీకట్లో పడరాని పాట్లు పడ్డారు. ప్లాట్‌ఫారంపై కేవలం ఒక్కటే ఫ్లడ్ లైట్ ఉండటంతో దూరంగా ఉన్న రైలును ఎక్కేందుకు చీకటి ఉండటంతో కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుగులో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమృత్‌మాల పథకంలో భాగంగా కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యుదీకరణ పనులు నడుస్తున్నాయనే సాకుతో అధికారులు స్టేషన్‌లో విద్యుత్ లైట్లను ఆన్ చేయక పోవడంతో రాత్రంతా చీకటిగానే ఉంటోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. నెల రోజుల నుంచి స్టేషన్ ప్రాంగణమంతా చీకట్లోనే ఉంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

సైబర్ మోసం.. దంపతుల అరెస్ట్



గోదావరిఖని: మ్యాట్రీమోనీ. పేరిట సైబర్ మోసానికి పాల్పడిన దంపతులను అరెస్ట్ చేసినట్లు రామగుండం సైబర్ క్రైం ఏసీపీ వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతనెల 5న మంచిర్యాల జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మ్యాట్రిమోనలో దంపతులకు పరిచయం అయ్యాడు. అందమైన అమ్మాయిని వారు చూపించడంతో ఆమెను పెళ్లి చేసుకునేందుకు అంగీకరించాడు. అయితే పెళ్లి చేసుకునే అమ్మాయిపేరుతో మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వద్ద పలు దఫాలుగా రూ.17లక్షలు తీసుకున్నారు. తమ తల్లి ఆరోగ్యం బాగోలేదని, చికిత్స కోసం డబ్బులు కావాలని చెప్పిన కొద్దీ వారి బ్యాంకు ఖాతాకు పంపించారు. చివరకు మోసపోయినట్లు గ్రహించడంతో సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. సైబర్‌క్రైం డీజీపీ శిఖా గోయల్, రామగుండం సీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సీఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. అయితే, హైదరాబాద్‌లో ప్రేమపెళ్లి చేసుకున్న దంపతులు.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా అశోక్‌నగర్ గంగానమ్మ టెంపుల్ సమీపంలో ఉంటున్న కారుడ్రైవర్ ఎర్ర వెంకటనాగరాజు(29), పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం హరిపురం గ్రామానికి చెందిన రామంచ సౌజన్య(26) మ్యాట్రీమోనీ.డాట్‌కామ్ అనే వెబ్‌సైట్ ప్రారంభించారు. సెల్‌ఫోన్ నంబర్లతో అమ్మాయిల పేరుతో ఫేక్ ప్రొఫైల్ క్రియేట్ చేశారు. అందమైన అమ్మాయిల ఫొటోలు అప్‌లోడ్ చేస్తూ, అబ్బాయిలకు రిక్వెస్ట్ పంపించేవారు. వాటికి స్పందించిన వారి వద్ద మోసపూరితంగా డబ్బులు వసూలు చేశారు. గత ఆగస్టు 8 నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు ఇదే విధంగా సదరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి పలుదఫాలుగా రూ.17లక్షలు వసూలు చేశారు. పోలీసులు వీరిని గురించి హరిపురం గ్రామంలో పట్టుకుని విచారించగా వాస్తవాలు అంగీకరించారు. ఇదే కాకుండా సైబరాబాద్ పరిధిలో ఒకరిని, మహబూబ్‌నగర్ పరిధిలో మరొకరిని కూడా దంపతులు ఇలాగే మోసం చేశారు. నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.